# విజయం మనదే కావాలి

- రామగుండంలో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీ ఇవ్వాలి
- చందర్‌ను మళ్లీ అసెంబ్లీకి పంపాలి
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్
- బీఆర్ఎస్‌లోకి ముగ్గురు రామగుండం కార్పొరేటర్లు



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన ముగ్గురు కార్పొరేటర్లను ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్

గోదావరిఖని/ యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబర్ 4: వచ్చే ఎన్నికల్లో విజయం మనదే కావాలని, రామగుండం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. రామగుండం కార్పొరేషన్‌కు చెందిన ముగ్గురు కార్పొరేటర్లు బుధవారం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 1వ డివిజన్ కార్పొరేటర్ ముదం శ్రీనివాస్, బీజేపీకి చెందిన 16వ డివిజన్ కార్పొరేటర్ మందల కిషన్ రెడ్డి, 40వ డివిజన్ కార్పొరేటర్ దుబాసి లలిత మల్లేశ్ పార్టీలో చేరగా, అమాత్యుడు కండువా కప్పి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో రామగుండంలో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీ తెచ్చేందుకు కలిసికట్టుగా పని చేయాలని, ఇచ్చిన మాట ప్రకారం రామగుండంను దత్తత తీసుకుంటామని మంత్రి కేటీఆర్ చెప్పినట్లు తెలిపారు. కాగా, ముగ్గురు కార్పొరేటర్ల చేరికతో రామగుండంలో ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలకు షాక్ తగిలింది. ఇటీవలే గోదావరిఖనిలో జరిగిన దశాబ్ది ప్రగతి సభలో బీజేపీకి చెందిన కార్పొరేటర్ కౌశిక లత హరి, మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన సంగతి తెలిసిందే. వరుస చేరికలతో రామగుండం బీఆర్ఎస్ పట్టు రెట్టింపవుతుండగా, పార్టీలో జోష్ కనిపిస్తున్నది.

# ప్రతిపక్షాల మాటలు నమ్మద్దు

- అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు



లబ్ధిదారురాలికి ఆసరా పెన్షన్ కార్డు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి/మారుతీనగర్, అక్టోబర్4 : ప్రతిపక్షాల మోసపూరిత మాటలు నమ్మవద్దని ప్రజలకు కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సూచించారు. తొమ్మిదేండ్లలో చేసిన పనులను చూసి బీఆర్ఎస్ అభ్యర్థిని ఆశీర్వదించాలని విజ్ఞప్తిచేశారు. బుధవారం మెట్‌పల్లిలోని వెంకట్‌రెడ్డి, మనోహర్ గార్డెన్స్‌ల్లో ఆసరా లబ్ధిదారులకు గుర్తింపుకార్డులు, పలువురి మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, కేసీఆర్ సర్కారు అమలు చేస్తున్న రైతుబంధు, రైతుబీమా, బీడీ కార్మికులకు జీవన భృతి, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళిత బంధు, బీసీ బంధు లాంటి అనేక పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. 2014కు ముందు ₹200 ఉన్న పింఛన్‌ను ₹4016కు పెంచిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. 75 ఏండ్ల స్వాతంత్ర్య భారతదేశంలో రాష్ట్రాన్ని 65 ఏండ్లు పాలించిన కాంగ్రెస్, బీజేపీలు ప్రజలను దోచుకోవడమే తప్పా చేసిందేమీలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఏనాడు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామ రక్ష అని అన్నారు. వైద్యవృత్తిని వదలి ప్రజా సేవచేసేందుకు మీ ముందుకు వస్తున్న తన కొడుకు డాక్టర్ సంజయ్ కల్వకుంట్లను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గతంలో ఆయన ఈ ప్రాంతంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించాడని, మెట్‌పల్లిలో నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల కోసం శిక్షణ ఇప్పించాడని, కోరుట్లలో ఐటీ హబ్‌ను ఏర్పాటు చేసి ఎంతోమంది యువతకు ఉపాధి ఇస్తున్నాడని గుర్తుచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, వైస్‌చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర్‌రావు, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

### మోసం చేసేవారికి అధికారం ఇవ్వద్దు

కాంగ్రెస్, టీడీపీలకు అధికారం అప్పగించి అరవై ఏండ్లు మోసపోయాం. ఎంతో గోసపడ్డం. మళ్లీ ఆ తప్పు చేయవద్దు. వాళ్లకు అవకాశమిచ్చి మోసపోవద్దు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణను సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్ల పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందించారు. వృద్ధులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలకు ప్రతినెలా ₹2016 పింఛన్ ఇస్తుండడంతో వారు నిశ్చింతగా బతుకుతున్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని ఆదరించాలి. 2019 ఎంపీ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి కవితను గెలిపించుకోలేకపోవడంతో అభివృద్ధి పరంగా ఎంతో నష్టం జరిగింది. అలాంటిది పునరావృతం కావద్దు.



**- డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి**

# చొప్పదండి గడ్డ బీఆర్ఎస్ అడ్డ

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- ఆటో యూనియన్ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం
- డ్రైవర్లకు హెల్త్‌కార్డులు అందజేత

గంగాధర, అక్టోబర్ 4 : చొప్పదండి గడ్డ బీఆర్ఎస్‌కు అడ్డ అని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. నియోజకవర్గంలో మూడోసారి గులాబీ జెండా ఎగురడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ఆటో యూనియన్ సభ్యులతో బుధవారం గంగాధర మండలం కురిక్యాల శుభమస్తు ఫంక్షన్‌హాలులో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. మధురానగర్ చౌరస్తాలోని హనుమాన్ ఆలయం నుంచి ఫంక్షన్ హాలు వరకు ఆటోలతో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆటో యూనియన్ సభ్యులకు దళిత బంధు, బీసీ బంధు కింద ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. ఎన్‌జీవోతో మాట్లాడి యూనియన్ సభ్యులకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను చేయిస్తామని భరోసా కల్పించారు. చౌరస్తాలో ఆటోలు నిలుపుకోవడానికి అడ్డా చూపిస్తామన్నారు. అర్హులైన ఆటో డ్రైవర్లకు పింఛన్ వచ్చేలా చూస్తామని చెప్పారు. ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మధురానగర్ చౌరస్తా వ్యాపార, వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. చౌరస్తాలో ప్రజల సౌకర్యార్థం కోసం మరుగుదొడ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం డ్రైవర్లకు హెల్త్‌కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమలో మార్కెట్ కమిటీ చైర్మన్ లోకిని ఎల్లయ్య, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, సర్పంచ్ వేముల దామోదర్, ఎంపీటీసీ అట్ల రాజిరెడ్డి, నాయకులు వేముల అంజి, బొల్లాడి శ్రీనివాస్‌రెడ్డి, రామిడి సురేందర్, పంజాల ఆంజనేయులు, సుంకె అనిల్, ఇరుగురాల రవి, పెంచాల చందు, సముద్రాల అజయ్, ఎండీ అబ్బాస్ పాల్గొన్నారు.



ఆటో యూనియన్ సభ్యులకు హెల్త్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

# కార్యకర్తలే నా బలం.. ప్రజలే నా బలగం

- కంటికి రెప్పలా కాపాడుకుంటా
- మంత్రి కొప్పుల ఈశ్వర్



చిల్వాకొడూర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి ఈశ్వర్

గొల్లపల్లి, అక్టోబర్ 4: 'కార్యకర్తలే నా బలం, ప్రజలే నా బలగం. నా తుది శ్వాస ఈ ప్రజల కోసమే. అందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటా. ఆపదొస్తే ఆదుకుంటా' అని మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. బుధవారం గొల్లపల్లి మండలం చిల్వకోడూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు 60 మంది, గుంజపడుగుకు చెందిన 20 మంది నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా, కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన సాగుతుందన్నారు. ప్రజలు ఏం అడుగకుండానే అన్నీ ఇస్తున్న కేసీఆర్ మన సీఎం ఉండడం అదృష్టమన్నారు. ఎన్నికలు వస్తున్నాయని, గ్రామాల మీద పడ్డ కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దని సూచించారు. అన్నివర్గాలను ఆదుకుంటూ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలుపుతున్న సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శంకరయ్య, జడ్పీటీసీ జలంధర్, సర్పంచ్ పద్మావతి రవీందర్, విండో అధ్యక్షులు వెంకట మాధవరావు, రాజసుమన్ రావు, ఎంపీటీసీ మహిబూబ్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు హమ్జద్ ఉన్నారు. కాగా, ధర్మపురి మండలం రామయ్యపల్లికి చెందిన బోగ రమేశ్, కాంగ్రెస్‌కు చెందిన గౌడ సంఘం నాయకులు 50 మంది ధర్మపురి క్యాంపు కార్యాలయంలో మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

# బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- సుల్తానాబాద్ మండలంలో 'గ్రామదర్శిని'



చిన్నకల్వలలో మహిళలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్, అక్టోబర్ 4: ఏ రాష్ట్రంలో చేపట్టని అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలంగాణలో ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌దే అని పెద్దపల్లి ఎమ్మెలే దాసరి మనోహర్‌రెడ్డి కొనియాడారు. బీఆర్ఎస్‌ను మళ్లీ ఆశీర్వదించాలని, కేసీఆర్‌ను ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. సుల్తానాబాద్ మండలంలోని చిన్నకల్వలలోని పలు ఆలయాల్లో ఎమ్మెల్యే బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామదర్శిని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా చిన్నకల్వల, చిన్నబొంకూర్‌లో పార్టీ శేణులతో కలిసి విస్తృతంగా పర్యటించి, ఇంటిటా ప్రచారం చేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి, బొట్టుపెట్టి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజల కష్టాలను తీర్చిన సీఎం కేసీఆర్‌ను ఎల్లకాలం గుర్తుంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇన్నేళ్లు ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని కాంగ్రెస్, ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో రాజకీయ లబ్ధికోసం ఆరాట పడుతున్నదని విమర్శించారు. అంతకుముందు చిన్నకల్వలలో సర్పంచ్ ఎరుకొండ రమేశ్‌గౌడ్, ఎంపీటీసీ గుర్రం సంపత్ గౌడ్ ఎమ్మెల్యేను సన్మానించారు. కాగా పలువురు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఆర్బీఎస్ జిల్లా అధ్యక్షుడు కాసర్ల అనంతరెడ్డి, ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్ రావు, సింగిల్ విండో చైర్మన్ దేవరనేని మోహన్ రావు, ఏఎంసీ చైర్‌పర్సన్ బుర్ర మౌనికాశ్రీనివాస్‌గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు సంపత్, ఫకీర్‌యాదవ్ పాల్గొన్నారు.

# సామర్థ్య శిక్షణకు మహిళా సర్పంచ్‌లు

కరీంనగర్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): ఉమెన్స్ ఇన్‌స్పైస్ అనే అంశంపై ఈ నెల 5 నుంచి 7 దాకా హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో జరిగే సామర్థ్య శిక్షణ కోసం జిల్లాకు చెందిన ఆరుగురు సర్పంచ్‌లు ఎన్నికైనట్లు డీపీఓ వీరబుచ్చయ్య తెలిపారు. తెలంగాణ రూరల్ డెవలప్‌మెంట్, నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణకు జిల్లాలోని చిగురుమామిడి మండలం రేకొండ సర్పంచ్ పీ రజిత, చొప్పదండి మండలం గుమ్లాపూర్‌కు చెందిన ఏ సరోజన, కరీంనగర్ రూరల్ మండలం తాహెర్ కొండాపూర్‌కు చెందిన ఎం మమత, మానకొండూర్ మండలం వన్నారానికి చెందిన పీ కవిత, సైదాపూర్ మండలం వెంకటేశ్వర్లపల్లికి చెందిన బీ పద్మ, తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌కు చెందిన జే శ్రీవాణి ఎంపికైనట్లు తెలిపారు.